క్లుప్తంగా

కాకాణిని కలిసిన నాయకులు



కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, రావుల ఇంద్రసేన్‌గౌడ్ ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడిగా ఇంద్రసేన్‌గౌడ్‌కు పార్టీ పదవి లభించేందుకు కృషి చేసిన కాకాణిని ఈ సందర్భంగా వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్రశర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

గురుకులంలో పేరెంట్స్ సండే



విద్యార్థులను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులు

ముత్తుకూరు: ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం పేరెంట్స్ సండే జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. చాలాసేపు నిరీక్షించిన తర్వాత మధ్యాహ్నం వీరిని లోపలికి అనుమతించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో దుకాణాలు కిక్కిరిసిపోయాయి.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలో విజయోత్సవ ర్యాలీని పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయ సెంటర్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్‌నారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 53.894 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 53.894 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లో లెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కార్యవర్గ ఏర్పాటు



మాట్లాడుతున్న పొండు

పొదలకూరు: ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లుగా సర్వేపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు దువ్వూరు పొండు ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా రషీద్, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్‌వలీ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆర్.కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాల కోసం తమ ఫోరం పనిచేస్తుందన్నారు. సభ్యులుగా 25 మందిని నియమించినట్లు తెలిపారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

నెల్లూరు(బృందావనం): మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణను వివరిస్తూ నగరానికి చెందిన చైతన్య ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్రను మెడికవర్ ఆస్పత్రి సెంటర్ నుంచి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో మొక్కలు నాటారు. జేసీఐ నెల్లూరు, శుభమస్తు షాపింగ్‌మాల్, ఫన్‌పార్క్, హైటెక్ ఫార్మా ప్రోత్సాహంతో యాత్రను చేపట్టానని చెప్పారు. సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, అభిషేక్, సాయి పాల్గొన్నారు.

దాత సాయం.. విద్యార్థులకు వరం

- ఒకప్పుడు హైస్కూల్ లేక ఇబ్బందులు
- స్కూల్‌ను కట్టించిన దొడ్ల కుటుంబం
- వారి సౌజన్యంతో హాస్టల్ భవనాల ఏర్పాటు
- నార్త్, సౌత్, ఈస్ట్ పేరుతో నిర్మాణాల పూర్తి

ఈస్ట్ బ్లాక్ భవనం



ఓ వ్యక్తి సంకల్పం వేలమంది పిల్లలకు వరమైంది. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దారి చూపింది. పొదలకూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో పేద పిల్లల కార్పొరేట్ స్కూల్ అంటే మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్ గుర్తుకొస్తుంది. గ్రామీణ బాల బాలికల కోసం ఆరు దశాబ్దాల క్రితమే దొడ్ల కుటుంబం సువిశాల భవనాలను నిర్మించింది.

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురంలో ఒకప్పుడు ఉన్నత పాఠశాల ఉండేది కాదు. పిల్లలు ప్రాథమిక విద్యతోనే సరిపెట్టుకునేవారు. ఈ విషయం తల్లిదండ్రులను బాధించేది. ఈ గ్రామానికి చెందిన దొడ్ల సుబ్బారెడ్డి అప్పట్లో పెద్ద కాంట్రాక్టర్‌గా పేరు గడించారు. హైస్కూల్ లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సుబ్బారెడ్డి సన్నిహితుల వద్ద ప్రస్తావించి తన తండ్రి శేషారెడ్డి పేరుతో గ్రామంలో 5.5 ఎకరాల సొంత మామిడి తోటలో హైస్కూల్‌ను కట్టించారు. బయటి ప్రాంతాల నుంచి సైతం విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యనభ్యసించేందుకు 1962లో పాఠశాలకు అనుబంధంగా దొడ్ల సుబ్బారెడ్డి మరో మూడెకరాల్లో వసతిగృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ విద్యాసంవత్సరంలో 400 మంది విద్యార్థులుండగా వచ్చే ఏడాది సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది.

2 శాతం నిధులను..

మహ్మదాపురం జెడ్పీ హైస్కూల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించేందుకు సుబ్బారెడ్డి మనవడైన దొడ్ల డైరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ నుంచి అనుమతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన డైరీ ఆదాయంలో నుంచి 2 శాతం నిధులు సుమారు రూ.75 లక్షలను పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. దీంతో అదనపు గదులు, మరుగుదొడ్లు, భవనానికి సున్నం, ల్యాబ్ గదికి మరమ్మతులు, పిల్లలకు యూనిఫాం, ఐడీ కార్డులు, బెంచీలు, తరగతి గదులకు తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డ్స్, వాటర్ ట్యాంక్, బోరు నిర్మాణం తదితర పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు – నేడు తొలివిడతలో డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేసి పూర్తి చేసింది.



భవనాల వద్ద శేషారెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

చక్కటి హాస్టల్ భవనాలు

ఆరు దశాబ్దాల నాటి శిథిలమైన భవనాలను కూల్చి దాని స్థానంలో కొత్త భవనాలను నిర్మించి దొడ్ల శంకరమ్మ ప్రభుత్వ బాలుర వసతిగృహాలు నిర్మించారు. దొడ్ల శేషారెడ్డి ఇందుకోసం వసతిగృహ సముదాయంలోని నార్త్ బ్లాక్‌కు రూ.1.60 కోట్లు, సౌత్‌బ్లాక్‌కు రూ.1.50 కోట్లు, ఈస్ట్ బ్లాక్ (మూడు ఫ్లోర్స్)కు రూ.2.90 కోట్లు వెచ్చించి నిర్మించారు. ఈస్ట్ బ్లాక్ నిర్మాణ పనులు ఇటీవల పూర్తి చేసుకోవడంతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్పొరేట్ హాస్టళ్లకు ఏ మాత్రం తగ్గకుండా భవనాలను నిర్మించారు. గతేడాది అక్టోబర్‌లో కలెక్టర్ ఆనంద్ భవనాలను పరిశీలించారు. ఈస్ట్ బ్లాక్ నిర్మాణ పనులను నాణ్యతను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

ఎంతోమంది చదువుకున్నారు



మహ్మదాపురం గ్రామంలో విద్యాలయాలు నిర్మించి ఇంత పేరు ప్రఖ్యాతలు వచ్చేందుకు దొడ్ల కుటుంబమే కారణం. వారు ఎక్కడ ఉన్నా గ్రామంపై ప్రేమానురాగాలను కురిపిస్తుంటారు. పాఠశాల, హాస్టల్స్‌ను అభివృద్ధి చేయాలని పరితపిస్తుంటారు. వారి వల్ల ఎంతోమంది చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నారు.

– గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పూర్వవిద్యార్థి, మాజీ సొసైటీ చైర్మన్, మహ్మదాపురం

నిరంతర పర్యవేక్షణ



దొడ్ల శేషారెడ్డి భవనాల నిర్మాణ సమయంలో నిరంతర పర్యవేక్షణ ఉండేది. నాణ్యతా ప్రమాణాలతో భవనాలను నిర్మించారు. కార్పొరేట్‌కు దీటుగా పిల్లల కోసం ఫర్నీచర్‌ను కూడా ఏర్పాటు చేయించారు. త్వరలో ప్రారంభించడం జరుగుతుంది.

– గడ్డం తిరుపాల్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, మహ్మదాపురం



మహ్మదాపురం డీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్



గతేడాది నిర్మించిన నార్త్ బ్లాక్ హాస్టల్ భవనం

రీ సర్వేపై అవగాహన సభ నేడు

ముత్తుకూరు: మండలంలోని పైనాపురం రెవెన్యూ గ్రామంలో చేపట్టే భూముల రీ సర్వేకు సంబంధించి సోమవారం ఉదయం ముసునూరువారిపాళెం సచివాలయంలో గ్రామసభ జరుగుతుందని రీ సర్వే డీటీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు తమ వద్ద ఉన్న రికార్డులు, ఆధార్, ఇతర పత్రాలతో సభలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: గేదెలు అడ్డురావడంతో మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం కోటమిట్టకు చెందిన కరిముల్లా పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు బయలుదేరగా కసుమూరు సమీపంలో గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో కరిముల్లాకు గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ నేత మృతికి సంతాపం

పొదలకూరు: మండల పెన్షనర్ల అసోసియేషన్ కోశాధికారిగా సేవలందిస్తున్న నరసాపురం సుబ్బయ్య మృతికి పలువురు నాయకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బయ్య 35 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేశారన్నారు. పెన్షనర్ల భవన నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు.

గ్రామాల్లో ప్రచారం



పొదలకూరు: మండలంలోని తాటిపర్తి, మహ్మదాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం చేపట్టారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మండల అధ్యక్షుడు జి.పెంచలనర్సయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాఘ పూర్ణిమ, రథసప్తమి, శివరాత్రి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మధు, పెంచలయ్య, భాగ్యమ్మ, సుధాకర్‌చారి, కృష్ణయ్య, రమాదేవి, పృథ్వీ, భార్గవ్, శేషాద్రి పాల్గొన్నారు.

వేధిస్తే.. వదిలిపెట్టం



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ మురళీధర్

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

చిల్లకూరు: కూటమి నేతల అడుగులకు మడుగులొత్తుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించి, అక్రమ కేసులు బనాయించే అధికారులను భవిష్యత్‌లో వదిలిపెట్టే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం గూడూరు మండలం మంగళపూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని సతీష్‌యాదవ్ కుటుంబీకులను పరామర్శించారు. కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కూటమి నేతలు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారని, వారికి పోలీసులు సహకారం అందిస్తున్నారని మండిపడ్డారు. గూడూరు రూరల్ పోలీసులు సతీష్ యాదవ్‌ను అక్రమంగా నిర్బంధించి దారుణంగా హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలోని పల్లెల్లో విధ్వంసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసాతో కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చిందని వెల్లడించారు. కూటమి నేతల ప్రోత్సాహంతో అక్రమ కేసులు నమోదు చేసే పోలీసులకు భవిష్యత్‌లో శంకరగిరి మాన్యాలే దిక్కని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిలపడిన కూటమి నేతలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ప్రభుత్వ వేధింపులకు భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ కాపాడుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నేత యద్దల నరేంద్రరెడ్డి, ఎంపీపీ బూదరు గురవయ్య, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, చిల్లకూరు మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాకృష్ణారెడ్డి, వాయిగండ్ల నాగరాజు పాల్గొన్నారు.

విజయలక్ష్మికి ఘన నివాళి





నివాళులర్పిస్తున్న కాకాణి, ప్రసన్న

కోవూరు: కోవూరు మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సతీమణి విజయలక్ష్మి మరణించారు. ఈ క్రమంలో ఆమె పార్థివదేహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామచంద్రాపురంలో ఉచిత వైద్యశిబిరాన్ని మెడికల్, ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు తిరుపతిరెడ్డి మాట్లాడారు. పేదలకు ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. పల్లవి ఐ క్లినిక్ లలిత్‌కుమార్, సామాజికవేత్త గండికోట సుధీర్‌కుమార్, కరిష్మా, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చ సాగుపై రైతుల ఆసక్తి



సాగులో ఉన్న పుచ్చ పంట

- పెరిగిన విస్తీర్ణం

పొదలకూరు: మండలంలో పుచ్చ సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతున్నట్టు ఉద్యానాధికారులు వెల్లడిస్తున్నారు. ఒక కిలో పుచ్చ విత్తనాలపై రైతులు రూ.5 వేలు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే మొగళ్లూరు, కనుపర్తి, ఆల్తుర్తి, ఆర్‌వైపాళెం, అంకుపల్లి, ఊసపల్లి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఒక్క మొగళ్లూరు గ్రామంలోనే సుమారు వందెకరాల్లో సాగు జరుగుతోంది. మల్చింగ్(పాలిథిన్ కవర్లు) పద్ధతిని పాటించడం వల్ల గడ్డి సమస్య లేకుండా రైతులు జాగ్రత్త పడుతున్నారు. ఈ పద్ధతిలో సాగు చేయని రైతులు గడ్డి పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రాణాలను హరిస్తున్న గుంతలు

- పెన్నాలో భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు
- ఈతకెళ్తూ పలువురి మృత్యువాత
- పొర్లుకట్టల ధ్వంసంతో పొంచి ఉన్న ప్రమాదం



పెన్నాలో యంత్ర సాయంతో ఇసుక తవ్వకాలు

కోవూరు: టీడీపీ నేతల ఇసుక దోపిడీ ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. పెన్నాలో పోతిరెడ్డిపాళెం నుంచి లేగుంటపాడు వరకు ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేపట్టారు. దీంతో పెద్ద గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉంది. గేదెలను తోలుకెళ్తున్న పశువుల కాపరులు.. ఈతకెళ్లి కొందరు ఈ గుంతల్లో పడి మరణిస్తున్నారు. గడిచిన ఆర్నెల్లో నలుగురు మృత్యువాత పడ్డారు.

భారీగా గొయ్యిలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి దగ్గరి బంధువైన ఒక వ్యక్తి పెన్నాలో ఇసుక తవ్వకాలకు అనుమతులు పొంది ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. ఎక్కడపడితే అక్కడ పది నుంచి ఇరవై అడుగుల లోతులో తవ్వకాలు సాగిస్తున్నారు. చేపల వేట కోసం ఇటీవల వెళ్లిన ఒక గిరిజనుడు జువ్విగుంటపాళెం వద్ద గొయ్యిలో పడి మృతి చెందారు. అదే ప్రాంతంలో మరో గుర్తుతెలియని మహిళ.. పాతిరెడ్డిపాళెం వద్ద ఈతకెళ్లి ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. గతేడాది వర్షాలు కురిసిన సమయంలో జువ్విగుంటపాళేనికి చెందిన ఆరుగురు తమ పశువులను మేపేందుకు పెన్నా మధ్యలోకి వెళ్లారు. అదే సమయంలో ముందస్తు సమాచారం లేకుండా పెన్నాకు నీటిని వదిలిపెట్టారు. దీంతో నది మధ్యలో గడ్డపై ప్రాణభయంతో ఉండగా, స్థానికుల సమాచారంతో గజఈతగాళ్లను అధికారులు పిలిపించి, బోట్ల సాయంతో వారిని రక్షించారు. పెన్నాలో ఎక్కడ ఏ గొయ్యి ఎంత లోతులో ఉందో తెలియక ప్రాణభయంతో మధ్యలోనే ఉండిపోయామని పశువుల కాపరులు చెప్పారు.

ఎక్కడికక్కడ పొర్లుకట్టల ధ్వంసం

కోవూరు పరిధిలోని పోతిరెడ్డిపాళెం నుంచి లేగుంటపాడు వరకు ఇసుక వాహనాలు బయటకు రావడానికి, వెళ్లేందుకు వీలుగా పొర్లుకట్టలను ధ్వంసం చేశారు. పెన్నాకు గతంలో మాదిరిగా వరదలొస్తే తీరం వెంబడి గ్రామాలకు ముప్పు పొంచి ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెన్నాలోకి వెళ్లాలంటేనే భయమేస్తోంది



విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలతో పెన్నాలో గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు పడినా జలాలను వదిలినా అక్కడ నీరు చేరుతుంది. లోతు తెలియక అక్కడికి వెళ్లి పలువురు మరణిస్తున్నారు.

– నాగరాజు, జమ్మిపాళెం

నియంత్రణ లేకపోతే మరెన్నో ప్రాణాలు పోతాయి



పెన్నాలో ఇసుకను భారీ స్థాయిలో తవ్వుతున్నారు. దీని వల్ల గుంతలు ఏర్పడి పలువురి ప్రాణాలు పోతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయకపోతే రానున్న రోజుల్లో ప్రమాదాలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.

– వెంకటేశ్వర్లు, జమ్మిపాళెం

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం

పెన్నాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం ఎక్కువ లోతులో గుంతలను తీయకుండా చూస్తాం.

– రంగనాథ్‌గౌడ్, ఎస్సై